నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

పవర్‌బోర్, హ్యాండ్ పంప్‌లకు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ: వేసవిలో ఎలాంటి నీటి ఎద్దడి తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ తెలిపారు. డివిజన్‌లో చెడిపోయిన పవర్‌బోరింగ్‌లు, హ్యాండ్ పంప్ బోరింగ్‌లను వాటర్‌వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం కవాడిగూడ డివిజన్‌లోని హుందాబాగ్‌లో చెడిపోయిన పవర్ బోరింగ్ మరమ్మతు పనులను కార్పొరేటర్ రచనశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవిలో ఎలాంటి నీటి సమస్య తలెత్తకుండా డివిజన్‌లోని అన్ని ప్రాంతాలు బస్తీలు, కాలనీలు, మురికివాడల్లో నిరుపయోగంగా ఉన్న పవర్‌బోరింగ్, హ్యాండ్ పంప్ బోరింగ్‌లను వాటర్‌వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటికి మరమత్తులు చేపట్టాలన్నారు. ప్రజలు కూడా నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ గంగపుత్ర, బీజేపీ నేతలు అనిల్‌కుమార్, గడ్డె శ్రీనివాస్, మోహన్‌సాయి, వాటర్ వర్క్స్ డీజీఎం కార్తీకరెడ్డి, మేనేజర్ శ్రీధర్ తదితరులున్నారు.

పోషకాహారంపై మహిళలకు అవగాహన



కాచిగూడ: మహిళలకు ఆరోగ్యం, పోషకాహారం గురించి సమగ్ర అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సీడీపీఓ జయశ్రీ అన్నారు. మంగళవారం నెహ్రూనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం పక్షోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, బాలికలకు ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారు సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాకిటి బాల, ఉమా టీచర్లు శివరాణి, చంద్రకళ, శోభ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో చాంపియన్‌షిప్



చాంపియన్‌షిప్ ట్రోఫీతో అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల జట్టుకు చాంపియన్‌షిప్ దక్కినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ ప్రకటించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యూకేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన ఎనిమిది జట్లు పాల్గొనగా.. అంబేడ్కర్ కళాశాల జట్టు, సర్దార్ పటేల్ కళాశాల జట్టు ఫైనల్‌లో పోటీపడ్డాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల జట్టు 9–2 తేడాతో విజయం సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల పట్ల అవగాహన పెంచుకోవడంతో పాటు పోటీతత్వాన్ని కలిగి ఉండాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ సెక్రటరీ డాక్టర్ కృష్ణ, ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నట్లు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ శ్రావణ్ తదితరులున్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ చందన

కవాడిగూడ: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లోనూ రాణించాలని సెంట్రల్ జోన్ ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ చందన పిలుపునిచ్చారు. అప్సా రూపాయి ఛాలెంజ్ సహకారంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మంగళవారం కవాడిగూడ డివిజన్‌లోని బండానగర్ కమ్యూనిటీహాల్ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళలకు సీఐ చందన శాలువాలు, మెమొంటోలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ చందన మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ప్రతీ తల్లిదండ్రులు లింగవివక్ష లేకుండా పురుషులతో సమానంగా మహిళలను చదివించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆమె సూచించారు. కిరణ్మయి, శీల, అప్సా కో ఆర్డినేటర్ బొట్టు రమేష్, అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, నర్సమ్మ, సరస్వతి బీజేపీ సీనియర్ నాయకులు కుమార్‌గౌడ్, బస్తీ మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో పోరాటం చేయాలి



మాట్లాడుతున్న పాశం యాదగిరి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువతీయువకులు స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో అవినీతిపై పోరాటం చేయాలని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి అన్నారు. మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో షాహిద్, భగత్‌సింగ్ స్మారక యువజనోత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర యువజనశాఖ సహకారంతో యువ కవి–గాయకుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ×మారేది పాలకులే తప్పా.. పాలన కాదని€ విమర్శించారు. నేటి రాజకీయ నాయకులు, అధికారుందరూ.. దొంగలేనని మీడియా మాఫీయాగా కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సునీల్, ప్రముఖ కవి జయరాజు, డీవైఎఫ్‌ఐ నాయకులు కె.విజయ్‌కుమార్, జావేద్ తదితరులున్నారు.

‘బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదు’

కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవహేలన చేసిన బీజేపీ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో ఓటుహక్కు అడిగే నైతికహక్కు లేదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. నేడు తెలంగాణ సమాజం బీజేపీని ప్రశ్నిస్తుందని, ఆనాడు తెలంగాణ ఏర్పాటును ప్రధానమంత్రి ప్రశ్నించారన్నారు. ‘బిడ్డను చంపి తల్లిని ఏర్పాటు చేశారని రాష్ట్ర ఏర్పాటుపై అవహేలనగా మాట్లాడారని’ చెప్పారు. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం వచ్చాక నిత్యావసర ధరలు పెరగడంతో పాటు డిజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ పార్టీ కూడా పదేళ్లలో అవినీతికి పాల్పడి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు నూకలు చెల్లాయని విమర్శించారు.


ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి



లిబర్టీ: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు దళిత బహుజన విద్యార్థి సమైఖ్య తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు వలిగొండ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఉపముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు రూ. 4 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. పాఠశాల నుంచి కళాశాల విద్యాస్థాయి వరకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

పెరిగిన దోమల బెడద

- సమన్వయ లోపంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- మూసీ పరివాహక ప్రాంతాల్లో అధికం
- నిర్లక్ష్యంగా నివారణ చర్యలు



అంబర్‌పేట్: దోమలు స్వైరవిహారంతో ప్రజలు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. మూసీ పరివాహక ప్రాంతాలైన గోల్నాక డివిజన్‌లోని కమలానగర్, న్యూ గంగానగర్, లంకబస్తీలు, న్యూ దుర్గానగర్, అంబర్‌పేట డివిజన్‌లోని అహ్మద్‌నగర్ తదితర ప్రాంతాల్లో దోమల బెడద అధికంగా ఉంది. చీకటి పడగానే దోమలతో మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా దోమల బెడద మరింత తీవ్రంగా నెలకొంది. పట్టించుకోవాల్సిన ఎంటామాలజీ విభాగం అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధిక ఉష్ణోగ్రతతో...

దోమల బెడుదతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధానంగా చిన్నారులు దోమల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ దోమల స్వైరవిహారం మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత వారం రోజులుగా అనుహ్యంగా దోమల బెడద తీవ్రమైంది. ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు పెరగడంతో చీకటి పడగానే దోమల బెడద పెరుగుతోంది. దీనిపై జీహెచ్‌ఎంసీ ఎంటామాలజీ విభాగం అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

సమన్వయ లోపం...

దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం సమన్వయ లోపంతో పనిచేస్తుంది. ఎంచుకున్న ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టడంలో నిర్లక్ష్యం చేస్తుంది. ఫాగింగ్ లోపంతో దోమల బెడద తీవ్రమవుతుంది. పకడ్బందీగా ఫాగింగ్ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు పరీక్షకాలం దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..

ఎండలు పెరగడంతోనే దోమల బెడద కాస్తా పెరిగింది. ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించి ఫాగింగ్‌తో నివారణ చర్యలు చేపడుతున్నాం. దోమల బెడద ఉన్న ప్రాంతాల్లో ప్రజలు ఫిర్యాదు చేస్తే తక్షణమే ఫాగింగ్‌కు చర్యలు తీసుకుంటాం.
– అంబికా, ఎంటామాలజీ విభాగం ఏఈ

గోల్నాకలో కార్డన్ సెర్చ్



అంబర్‌పేట్: అసాంఘిక శక్తుల పట్ల కఠిన చర్యలు ఉంటాయని ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ అన్నారు. అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి గోల్నాకలో కర్డన్‌సెర్చ్ నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి గంగానగర్, కమలానగర్ ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 19 ద్విచక్ర వాహనాలు, 4 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అనుమానస్పద వస్తువులు, వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. ఈ కర్డన్‌సెర్చ్‌లో ఏసీపీ రఘు, ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ఎస్సైలు విజయ్, అశోక్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అంబర్‌పేట్: భార్య వదిలి వెళ్లిపోవడంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లో నివసించే ఆంజనేయులు (52) గత రెండేళ్ల క్రితం భార్య వదిలి వెళ్లడంతో తల్లి వద్దే ఉంటున్నాడు. తల్లి ఇళ్లల్లో పనిచేసుకుంటూ.. పోషిస్తుంది. కాగా మంగళవారం ఉదయం తల్లి పనికి వెళ్లిన అనంతరం ఆంజనేయులు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరిగి ఇంటికొచ్చిన ఆమె తలుపు తట్టగా.. స్పందించకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారిని పిలిచింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని తలుపులను తొలగించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బండరాయితో మోది హత్య చేసిన నిందితుడి రిమాండ్



చిక్కడపల్లి: బండరాయితో మోది హత్య చేసిన నిందితుడిని చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో డివిజన్ ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య మీడియా ప్రతినిధుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత కొన్ని నెలల నుంచి శాస్త్రి గోపాల్ అలియాస్ గోపాల్‌రెడ్డి(72) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బాగ్‌లింగంపల్లిలోని పుట్‌పాత్‌పై నివసిస్తున్నాడు. అతడితో పాటు సూర్యాపేటకు చెందిన చెకూరి నరేందర్(40) కూడా ఉంటున్నాడు. గత కొద్ది రోజుల నుంచి శాస్త్రి గోపాల్ పుట్‌పాత్‌పై తనను పడుకోనివ్వడం లేదని, దీంతో కోపం పెంచుకుని హత్య చేసినట్లు నిందితుడు పోలీసుల విచారణలో తెలిపాడు. హత్య అనంతరం నిందితుడు తప్పించుకుని పారిపోయాడని, ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశామన్నారు. టాస్క్‌పోర్స్ పోలీసుల సాయంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్సై నాగరాజు, శివపాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియామకం

పంజగుట్ట: తెలంగాణ బీసీ కులాల ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా తుమ్మల చెన్నయ్య ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం పంజగుట్ట లోని వేదిక కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు పాండు యాదవ్, రాష్ట్ర నేతలు సంజీవ్ ముదిరాజ్‌ల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ బీసీ కులాల ఐక్య వేదిక నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు.

బీజేపీపై విశ్వాసం పెరిగింది



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ పనితీరుతో దేశ ప్రజల్లో బీజేపీపై విశ్వాసం పెరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ సీనియర్ నేత డాక్టర్ జి.హరిచరణ్ ఆధ్వర్యంలో బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ప్రముఖ వైద్యులు, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ కె.ఎస్.సోమశేఖర్‌రావుతో పాటు పలువురు వైద్యులు కేంద్రమంత్రి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కండువాలు కప్పి వారిని కేంద్రమంత్రి ఆహ్వానించారు. మోదీ పాలనలో అభివృద్ధిని కొనసాగించేందుకు బీజేపీకి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, కృష్ణయాదవ్, పుట్ట పాండురంగయ్య, చుక్క జగన్, శ్యామ్‌రాజ్, అజయ్, సునంద, మహేశ్వరి ఉమ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో బీజేపీదే విజయం

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సికింద్రాబాద్‌లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఫలితంగానే వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 400లకు పైగా సీట్లలో విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, చింతల రాంచంద్రారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శ్యామ్‌సుందర్, ఆనంద్‌గౌడ్, కె.గీతామూర్తి, అట్లూరి రామకృష్ణ, వీరెల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్



ఉపాధ్యాయులకు నియామకపత్రాలను అందజేసిన దృశ్యం

ముషీరాబాద్: ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్, బ్యాంక్ ఆఫ్ అమెరికా సంయుక్తాధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాస్‌రూమ్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణి శిక్షణనిచ్చే ఉపాధ్యాయులకు నియామకపత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే డిజిటల్ క్లాస్‌లు, కంప్యూటర్ శిక్షణ, భవిష్యత్తులో ఉన్నత విద్యకు దోహదపడతాయన్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలలకు తమవంతు సహకారం అందించాలన్నారు. ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్ ప్రతినిధులు రాధాకృష్ణ, శ్రావణి, కీర్తన, అరుణాదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రత్నం, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



కార్మిక శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు

ముషీరాబాద్: ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో కార్మికశాఖ కమిషనర్ ఎస్.కృష్ణాదిత్యకు భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఆన్‌లైన్ దరఖాస్తులకు గత ఆరు నెలలుగా సర్వర్ పనిచేయడం లేదని అధికారులకు అనేకసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. దీంతో రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.అన్వేష్, ప్రధాన కార్యదర్శి సాంబశివుడు అన్నారు. తప్పులను సరిచేసేందుకు స్థానిక అధికారులకు అవకాశం ఇవ్వాలని కోరారు. సంక్షేమ బోర్డులోనూ కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని చెప్పారు. రాజు, కృష్ణ, బాలు, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న డాక్టర్ లయన్ రమణ

చిక్కడపల్లి: డయాబెటిస్‌తో ఉన్నవారు ఆరోగ్యవంతమైన జీవనశైలిని పాటించాలని ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ పిన్ను నాగభూషణం సూచించారు. చిక్కడపల్లిలోని శ్రీసాయి డయగ్నస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరంలో డయాబెటిస్‌కు సంబంధించిన హెచ్‌బీఏ1సీ పరీక్షలకు నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి విశేస స్పందన లభించిందని సెంటర్ డైరెక్టర్ లయన్ డాక్టర్ జీకే రమణ పేర్కొన్నారు. సుమారు 70 మందికి ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. రోజూ తప్పనిసరిగా 45 నిముషాలు నడక, యోగచేయాలని వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. క్యాంప్ సభ్యులు మధుసూదన్, లయన్ సాయిరితీష్, సతీష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన ఉప్పల రాజేశ్వర్

కాచిగూడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వైశ్య హాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్ అన్నారు. మంగళవారం కాచిగూడ వైశ్య హాస్టల్‌లో విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో విద్యార్థులు ముందుండాలని సూచించారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. విద్యార్థుల క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, స్నేహభావంతో మెలగాలన్నారు. గెలుపోటములకు ప్రాధాన్యత ఇవ్వకుండా పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా చెస్, క్యారమ్, బ్యాట్మింటన్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడాపోటీలను విద్యార్థులకు నిర్వహించారు. వైశ్య హాస్టల్ ప్రధాన కార్యదర్శి పబ్బతి రవి ప్రసన్నకుమార్, రాజేశ్వర్‌రావు, మధు, వీరబొమ్మ శ్రీనివాస్, భాస్కర్ గుప్తా, జయరామ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రలకు ఉద్యోగభద్రత కల్పించాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో గత 16 ఏళ్లుగా ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్‌లో ఆరోగ్య మిత్రులుగా విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆరోగ్య మిత్రల ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరియాదయ్య, ఎం.కుమార్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో వారు మాట్లాడుతూ.. ఆరోగ్య మిత్రులుగా విధులు నిర్వహిస్తున్న తమను గుర్తించి మా కేడర్ ఫైల్‌ను ప్రభుత్వానికి పంపించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి విశాలాక్షికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆరోగ్య మిత్రులందరికీ ఉద్యోగ భద్రతతో పాటు టీఏ, డీఏ సౌకర్యాలు కల్పించాలని కోరారు.

‘ధర్మసమాజ్ పార్టీ’ పార్లమెంట్ ఇన్‌చార్జిల నియామకం

కాచిగూడ: ధర్మ సమాజ్ పార్టీ వివిధ పార్లమెంట్ స్థానాలకు ఇన్‌చార్జిలను ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ మంగళవారం ప్రకటించారు. మెదక్ – అన్నెల లక్ష్మణ్, భువనగిరి – దుర్గాప్రసాద్ మహారాజ్, సికింద్రాబాద్ రాసాల వినోద్‌కుమార్, చేవెళ్ల – రాఘవేంద్ర ముదిరాజ్, కరీంనగర్ – చిలువేరు శ్రీకాంత్, నిజామాబాద్ – కండెల సుమన్, హైదరాబాద్ – గడ్డం హరీష్‌గౌడ్, వరంగల్ – మేకల సుమన్, మహబూబాబాద్ – రవ్వ భద్రమ్మ, మహబూబ్‌నగర్ – గంట్లవెల్లి రాకేష్‌లను నియమించారు.

ఎన్నికల కోడ్ అమలుకు చర్యలు



వాల్ పోస్టర్, పెయింటింగ్‌ను తొలగిస్తున్న దృశ్యం

అంబర్‌పేట్: పార్లమెంటు ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలులో అధికారులు నిమగ్నమయ్యారు. అంబర్‌పేట నియోజకవర్గంలో డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ హేమలత పర్యవేక్షణలో ఎన్నికల కోడ్ అమలుకు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నియోజకవర్గంలో వివిధ పార్టీలకు చెందిన వాల్‌పోస్టర్లు, వాల్‌పెయింటింగ్‌లను తొలగింపజేశారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని ఈ సందర్భంగా వివరించారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలో శ్రీకృష్ణుడు, సత్యభామ, నారదుడి పాత్రల్లో..

చిక్కడపల్లి: శివాని ఆర్ట్స్ అసోసియేషన్, వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభ ప్రధానవేదికలో శ్రీ కృష్ణరాయబారం, రామ భక్త హనుమాన్ నాటక ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నారు. మంగళవారం రాత్రి నిర్వహించిన ప్రదర్శనలో కృష్ణుడిగా మున్నంగి దయాకర్, ఆంజనేయుడుగా మున్నంగి జగన్ , గరుత్మంతుడిగా సాల్వాచారి, నారదుడిగా గాబ్రియెట్, సత్యభామగా సాయిలక్ష్మిలు పాత్రోచితంగా నటించారు. తెలంగాణ ప్రాచీన కళారూపమైన చందు యక్షగానాన్ని చెన్నయ్య, పుల్లయ్యల బృందం ఆకర్షనీయంగా చేశారు. జంగయ్యగౌడ్, సాంబశివారెడ్డి, వెంకటరమణ, శ్రీరామ, మంగపతి తదితరులున్నారు.

దళిత విద్యార్థులందరికీ విదేశీ విద్యా నిధి పథకాన్ని వర్తింపజేయాలి



హిమాయత్‌నగర్: దరఖాస్తు చేసుకున్న ప్రతి దళిత విద్యార్థికి విదేశీ విద్యా పథకాన్ని వర్తింపజేయాలని నేషనల్ ఇంటెలెక్చువల్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ డిమాండ్ చేసింది. ప్రస్తుతం ఎస్సీ విద్యార్థులకు 200 మందికి మాత్రమే అంబేడ్కర్ ఓవర్సీస్ పథకం అమలు చేస్తున్నారని,ఆ నిబంధనను తొలగించి దరఖాస్తు చేసిన ప్రతి దళిత విద్యార్థికి రూ.30 లక్షలు విదేశీ విద్య పథకం కింద అందజేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు చింత భగవాన్ ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ జయరాం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.18,600 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసును పటిష్టంగా అమలు చేసి, దళితులకు పూర్తి రక్షణ కల్పించాలన్నారు. రామంతపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం జనరల్ కోట కింద సీట్లు పొందిన ఎస్సీ, ఎస్టీల విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే స్కాలర్ షిప్‌లకు దరఖాస్తు చేసుకోకుండా వారి తల్లిదండ్రుల నుంచి అఫిడవిట్ తీసుకుంటున్నారని ఈ విషయంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.